
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 3
శనివారం 31 మే 2025





తొగుట పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేయాలి

- నీతి, నిజాయితీ, క్రమశిక్షణ తప్పొద్దు
- పాత నేరస్థులపై నిఘా ముమ్మరం చేయండి
- సీపీ డాక్టర్ అనురాధ

తొగుట, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణే ధ్యేయంగా విధులను నిర్వహిస్తూ, ప్రజల మన్ననలు చూరగొనాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ అన్నారు. శుక్రవారం సీపీ తొగుట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీతి, నిజాయితీ, క్రమశిక్షణ పాటిస్తూ విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. పాత నేరస్థులపై నిఘా ముమ్మరం చేయడంతో పాటు వారి కదలికలను గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. విలేజ్ పోలీస్ ఆఫీసర్‌కు కేటాయించిన గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సమస్యలు పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బ్లాక్‌స్పాట్ల వద్ద ఆర్ అండ్‌బీ అధికారుల సమన్వయంతో స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్‌రావుతో పాటు వివిధ పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

వెంటాడుతున్న బీజీ–3 భూతం

నిషేధిత, నకిలీ పత్తి విత్తనాల బెడదతో రైతుల బేజారు

తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు అంటూ అంటగడుతున్న వ్యాపారులు

భూసార క్షీణత, కాలుష్య కారకమవడంతో నిషేధం

అయినా గ్రామీణ మార్కెట్‌లో లభిస్తున్న విత్తనాలు

కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్ 5



రోటరీ క్లబ్ సేవలు అమోఘం

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



మహిళకు స్వయంగా పరీక్షలు చేస్తున్న నిర్మలా జగ్గారెడ్డి



పరీక్షలు చేయించుకుంటున్న నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. సదాశివపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంపులో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ, రోటరీ క్లబ్ లేక్ డిస్ట్రిక్ట్ మొయినాబాద్ అధ్యక్షులు ఓదెల రాజశేఖర్, డాక్టర్ వెంకట రంగారెడ్డి డాక్టర్ ఎర్ర శివకుమార్, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ చంద్రశేఖర్, మాలతీలత, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రోహిత్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ప్రనూకర్, మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రి డాక్టర్ నికిత, డాక్టర్ ఆఫ్రిన్, డాక్టర్లు ప్రీతి, శ్రావ్య, కీర్తి, శ్రావణి పాల్గొన్నారు. పద్మావతి అంబులెన్స్ సర్వీస్ చరణ్ నరేష్ అందించారు. సదాశివపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఓదెల ప్రభు గుప్తా, సెక్రెటరీ అశోక్‌కుమార్ బస్వా, ట్రెజరీ వేణు, సభ్యులు మాట్లాడుతూ శిబిరంలో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, డయాబెటిస్, బీపీ, జనరల్‌హెల్త్‌కు సంబంధించి 320 మంది రోగులకు వైద్యం అందించామన్నారు. 52 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్, 110 మందికి కార్డియాలజీ పరీక్షలు, 158 మందికి జనరల్ వైద్యాన్ని అందించి, ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు.

పారదర్శకంగా ఎంపిక

అర్హత లేని వారికి ఇందిరమ్మ ఇల్లు వస్తే క్యాన్సల్ చేస్తాం

ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వద్దు

త్వరగా నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేసుకోవాలి

హుస్నాబాద్ భూముల్లో తొండలు గుడ్లు పెట్టడం కాదు..

బంగారం పండేలా కృషి చేస్తా

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్/కోహెడ, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగానే జరిగిందని, పేదల్లో పేదలకు మాత్రమే ఇళ్లు మంజూరయ్యాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అనర్హులకు ఇళ్లు మంజూరు చేసినట్లయితే అవి క్యాన్సల్ చేస్తామని వెల్లడించారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పట్టణంలో 144 మంది, మండలంలోని 160 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వద్దని సూచించారు. జూన్ 9వ తేదీలోగా ఇళ్లకు ముగ్గులు పోసుకొని స్పీడ్‌గా నిర్మించుకుని గృహప్రవేశాలు చేయాలన్నారు. ఉచితంగా ఇసుక పొందేందుకు కూపన్లు ఇస్తామని, ఇంకుడు గుంతలకు, డబ్బులు వస్తాయని, ఉపాధిహామీ కింద బాత్రూమ్‌ను నిర్మాణం చేసుకోవచ్చన్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి డబ్బులు లేనట్లయితే మహిళా సంఘాల నుంచి రూ.లక్ష తీసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం ఇల్లు రాని వారికి రెండో విడతలో ఇస్తామన్నారు. కోహెడలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 392 మంది లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను మంత్రి పంపిణీ చేశారు. కోహెడ మండలం పోరెడ్డిపల్లిలో 90 ఇళ్లను పైలెట్ ప్రాజెక్టుగా నిర్మిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను లబ్ధిదారులతో కలసి మంత్రి ప్రారంభించారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు : మంత్రి పొన్నం




పామాయిల్ గెలలను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఐదు ఎకరాల పైబడి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టిపెడితే లాభాలు పొందే అవకాశం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లో ఆయిల్‌పామ్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ జంగా వెంకటరాఘవరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక్కసారి ఆయిల్‌పామ్ సాగు చేస్తే 30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తూనే ఉంటుందని వివరించారు. హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ భూముల్లో తొండలు గుడ్లు పెట్టడం కాదు.. ఈ నేలపై బంగారం పండేలా కృషి చేస్తున్నామన్నారు.

సిద్దిపేట మున్సిపాలిటీతో పాటు చుట్టూ 26 గ్రామాలతో ఏడేళ్ల క్రితం పురుడుపోసుకున్న సుడా (సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రస్తుతం జిల్లా మొత్తానికి విస్తరించింది. అయినా ఏం లాభం ఇది కేవలం ఉత్తర్వులకే పరిమితమైంది. ఆదాయం పెంచుకునేందుకు ప్రణాళిక లేదు. అభివృద్ధి యాక్షన్ ప్లాన్ ఊసెత్తడం లేదు. కనీసం చైర్మన్‌ను నియమించడం లేదు. ఏ ప్రయోజనం ఆశించి సుడా పరిధిని విస్తరించారో ఆచరణలో మాత్రం అటకెక్కింది.

- సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 30



సిద్దిపేటలోని సుడా కార్యాలయం

సుడా.. పేరుకే బడా

విస్తరణకే పరిమితం.. ఆదాయానికి దూరం

గతంలో సిద్దిపేట మున్సిపాలిటీ, 26 గ్రామాలే

ప్రస్తుతం జిల్లా మొత్తం చేరిక

సుడాలో ఐదు మున్సిపాలిటీలు, 286 గ్రామాలు

అయినా పైసా పెరగని రాబడి

అక్టోబరు 2017లో సుడాను ఏర్పాటు చేయగా, చైర్మన్, వైస్‌చైర్మన్ డైరెక్టర్‌లను నియమించి పాలనను పరుగులు పెట్టించారు. నాడు సిద్దిపేట మున్సిపల్‌తో పాటు 26 గ్రామాలను సుడా పరిధిలోకి తీసుకవచ్చారు. ఇక్కడ ఏదైనా నిర్మాణం జరగాలంటే సుడా అనుమతి తప్పనిసరిగా అమలుచేశారు. దీంతో సుడాకు ఆదాయం సమకూరింది. జిల్లా కేంద్రం అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించింది. సిద్దిపేట, చుట్టపక్కల గ్రామాల్లోని కూడలీల సుందరీకరణ, ఇతర అనేక అభివృద్ధి పనులను సుడా నిధులతో చేపట్టింది. ఈ అభివృద్ధిని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం సుడా పరిధి విస్తరణకు ఉత్తర్వులను జారీ చేసింది.

హెచ్ఎండీఏ మినహా..

హెచ్ఎండీఏ పరిధిలోని 74 గ్రామాలు మినహా మిగతా జిల్లా మొత్తాన్ని గతేడాది అక్టోబరులో సుడా పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో సుడా 26 గ్రామాల నుంచి 286 రెవెన్యూ గ్రామాలకు, ఒక మున్సిపాలిటీల నుంచి మరో నాలుగు మున్సిపాలిటీలకు విస్తరించింది. అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి, చేర్యాల, రాయపోల్, కొమురవెల్లి, నంగునూరు, తొగుట, చిన్నకోడూరు, దౌల్తాబాద్, గజ్వేల్, హుస్నాబాద్, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట, దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి, మిరుదొడ్డి, ధూలిమిట్ట, మద్దూరు, జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లి, కొండపాక మండలాల్లోని 286 రెవెన్యూ గ్రామాలను సుడా పరిధిలోకి వచ్చాయి. గతంలోని సిద్దిపేటతో పాటు చేర్యాల, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, దుబ్బాక మున్సిపాలిటీలు సుడాలో చేరాయి.

ఎక్కడికక్కడే అనుమతులు

విస్తరిస్తే సుడా ఖజానాకు తిరుగులేదనుకుంటే, అంతా ఊహలకే

మిగతా 6వ పేజీలో

చైర్మన్ కుర్చీ ఖాళీ



సుడా ఏర్పాటు అనంతరం ఏప్రిల్ 2018లో చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు 14 మందితో పాలక వర్గాన్ని గత ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వం మారడంతో నామినేటెడ్ పదవులన్నీ రద్దయిన విషయం తెలిసిందే. దీంతో డిసెంబరు 2023 నుంచి సుడా చైర్మన్ పదవి ఖాళీగానే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సిద్దిపేటకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు సుడా చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. సుడాను విస్తరించడంతో చైర్మన్ పదవికి మరింత డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సుడా వైస్‌చైర్మన్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కానీ, ప్రభుత్వం సుడా పాలకవర్గం కమిటీ నియామకంలో ఆలస్యం చేస్తూ వస్తున్నది.

పాలన చేతకాక ప్రతిపక్షాలపై విమర్శలా?

- కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారు
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మే 30 (ఆంధ్రజ్యోతి) : పాలన చేతకాక కాంగ్రెస్ ప్రతిపక్షాల మీద విమర్శలకు దిగుతున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన దుబ్బాకలోని క్యాంపు కార్యాలయంలో 150 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నా, ముందస్తు చర్యల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను వదిలి డైవర్షన్ రాజకీయాలతో కాలం గడుపుతున్నదని ధ్వజమెత్తారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, నాయకులు తదితరులు ఉన్నారు.

మూడు నెలల సన్నబియ్యం.. ఒకేసారి

జిల్లాకు 18,826 మెట్రిక్ టన్నుల బియ్యం

రేపటి నుంచి పంపిణీకి ఏర్పాట్లు

మద్దూరులో రేషన్‌షాపులో దించుతున్న మూడు మాసాల రేషన్ బియ్యం



సిద్దిపేట కలెక్టరేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో గతంలో ఎన్నడూలేని విధంగా మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఒకేసారి అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. దీంతో జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ కోటాను జూన్ నెలాఖరులోగా సరఫరా ఒకేసారి సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. దీనికి జిల్లాలో పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతీ నెలా సరఫరా చేసే ఎంఎల్ఎస్ (మండల్ లెవల్ స్టాక్) పాయింట్ల నుంచి రేషన్ షాపులకు బియ్యం రవాణా ప్రక్రియను ప్రారంభించారు. జిల్లాలోని 686 రేషన్ షాపులకు మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్లు నుంచి సరఫరా చేస్తున్నారు. అయితే మూడు నెలలకు సంబంధించి ఒకేసారి పంపిణీ చేయనుండడంతో 18,826 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంటుందని అధికారుల తెలిపారు.

రేషన్‌కార్డుల్లో కొత్తగా 93,799 మంది

రేషన్ కార్డు లేక దాదాపుగా 9 సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నూతనంగా

మిగతా 6వ పేజీలో

'కగార్' పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ఎన్‌కౌంటర్లపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టులు శాంతి చర్చలకు ముందుకు వచ్చినా పట్టించుకోకుండా నిరంకుశంగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని విమర్శించారు. నక్సలైట్ల శవాలను కూడా వారి కుటుంబాలకు అప్పగించకపోవడం అప్రజాస్వామికమన్నారు. సంపదలో ప్రపంచంలో నాలుగో దేశంగా భారతదేశం చేరిందని గొప్పగా చెప్పుకుంటున్నారని, కానీ పేదోడి జీవన ప్రమాణాలు ఏ మాత్రం మారలేదన్నారు. దేశ అప్పులపై కేంద్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంపద పెరిగితే రూ. 160 లక్షల కోట్ల అప్పు ఎలా ఉందని ప్రశ్నించారు. మెట్ట ప్రాంత వరప్రదాయిని, సీపీఐ కళల పంట గౌరవెల్లి ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని ఆయన కూడా తొందరగా పూర్తి చేయాలని చెప్పారన్నారు. అనంతరం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ జూన్ 27వ తేదీన హుస్నాబాద్‌లో సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి హాజరవుతున్నారని చెప్పారు.

బంగారు నగల కోసం మహిళ దారుణ హత్య

- గొంతుకోసి పుస్తెల తాడు, నాను ఎత్తుకెళ్లిన దుండగులు 5





హెచ్చరికలే.. పర్యవేక్షణేది?

గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్‌లోకి ఫొటోల కోసమని దిగి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు జనవరిలో మృత్యువాతపడిన విషయం తెలిసింది. అప్పటి నుంచి స్థానిక పోలీసులు రిజర్వాయర్‌పైకి ఎవరూ వెళ్లకుండా నాలుగు దిక్కులా దారిని మూసివేశారు. హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అయినా కొందరు పర్యాటకులు కాలినడక పైకి చేరుకుని ప్రమాదకరంగా సెల్ఫీలు దిగుతున్నారు. పర్యవేక్షణ లేక రిజర్వాయర్‌లోకి దిగుతున్నారు.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్





64 కొనుగోలు కేంద్రాల మూసివేత

● రూ. 93 కోట్లు రైతుల ఖాతాల్లో జమ


తూప్రాన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, మే 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తవడంతో 64 కేంద్రాలు మూసివేసినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో 80 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా కొనుగోలు పూర్తి కావడంతో 64 కేంద్రాలను మూసి వేసినట్లు వివరించారు. కేవలం 16 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 12,787 మంది రైతుల నుంచి 4,66,000 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ. 93.35 కోట్ల నగదు జమ చేసినట్లు స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో 87 శాతం రైతులకు డబ్బులు జమ చేసినట్లు వివరించారు.

సమస్యల్లో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

● ఐదేళ్లయినా పూర్తికాని నిర్మాణ పనులు
● ఇబ్బందులు ఎదుర్కొంటున్న పునరావాసులు
● కొందరు ప్యాకేజీలకు దూరం.. మరికొందరికీ పూర్తికాని ఇళ్లు

ములుగు, మే 30 (ఆంధ్రజ్యోతి) : కొండపోచమ్మసాగర్ నిర్వాసితులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రాజెక్టు పనులు పూర్తయిన నిర్వాసితులకు ఇంకా న్యాయం జరగలేదు. నిర్వాసితులకు ఎదురుచూపులు తప్ప లాభం చేకూరే పరిస్థితులు కనిపించడం లేదు. నిర్వాసితులకు ఆర్ అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసినప్పటికీ సరైన వసతులు, నిర్మాణాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు.

సిద్దిపేట జిల్లా ఉమ్మడి ములుగు మండలంలోని మామిడ్యాల, బైలంపూర్, తానేదార్‌పల్లి, తానేదార్‌పల్లి తాండ గ్రామాల కలుపుతూ కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ఆయా గ్రామాల్లో భూములు, ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం, ఇళ్ల ప్యాకేజీ ప్రకటించారు. భూసేకరణపై కొందరు కోర్టుకు వెళ్లగా, మరికొందరికి ఇళ్లు, పరిహారం అందజేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం ఊర్లన్నీ ఖాళీ చేయించారు. పరిహారం పొందిన కుటుంబాలకు ములుగు మండలం తునికిబొల్లారం గ్రామశివారులో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మించి పునరావాసం కల్పించారు. కోర్టుకు వెళ్లిన కుటుంబాలకు పరిహారం నిర్ణయం జరగకపోవడంతో తాత్కాలికంగా రేకుల షెడ్స్ ఏర్పాటు చేసి నివాసం కల్పించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇళ్లతో పాటు, గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల భవనం, కూరగాయల మార్కెట్, ఆలయాలు, ఫంక్షన్‌హాళ్లు నిర్మాణం చేస్తామని ప్రకటించారు.


పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన కూరగాయల మార్కెట్ నిర్మాణం


అసంపూర్తిగా బైలంపూర్ ఫంక్షన్‌హాల్

అసంపూర్తి నిర్మాణాలు

ప్రభుత్వం ఇచ్చిన మేరకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్మాణాలు పూర్తి చేయలేదు. ఒక్కొక్క నిర్వాసిత గ్రామంలో పనులను మధ్యలోనే వదిలేశారు. మామిడ్యాలలో ఫంక్షన్ హాల్ పూర్తి చేసినప్పటికీ ప్రారంభించలేదు. దీంతో ఫంక్షన్‌హాల్ ఆవరణ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. గ్రామస్థుల కోసం కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టి, పిల్లర్ల స్థాయిలోనే వదిలేశారు. గ్రామంలో నిర్మాణం చేపట్టిన ఆలయాలు కొన్ని పూర్తికాగా, మరి కొన్ని నిర్మాణంలో నిలిచిపోయాయి. బైలంపూర్‌లో ఫంక్షన్ నిర్మాణం అసంపూర్తిగానే నిలిచిపోయింది. ఫంక్షన్‌హాల్‌లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. కూరగాయల మార్కెట్ స్థలం కేటాయింపులోనే నిలిచిపోయింది.

కొందరికీ ప్యాకేజీలు.. మరికొందరికీ ఇళ్లు..

కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని బాధితులు వాపోయారు. మామిడ్యాల, బైలంపూర్ గ్రామాలకు చెందిన పలువురి పరిహారం ప్యాకేజీలు అందజేయగా, ఇళ్లు అందజేయలేదు. మరికొందరికీ ఇళ్లు వచ్చి ప్యాకేజీలు రాలేదు. కొందరికైతే ప్యాకేజీలు, ఇళ్లు ఏవీ రాలేదు. బాధితులు పరిహారం, ఇళ్ల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్న న్యాయం జరగడంలేదని బాధితులు పేర్కొంటున్నారు.

ఇళ్ల నిర్మాణాలు

కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టులో నిర్వాసితులు కొందరు ప్రభుత్వం ప్యాకేజీలు అందజేయడంతో ప్రస్తుతం నిర్మాణాలు చేసుకుంటున్నారు. కోర్టుకు వెళ్లిన బాధితులకు ప్రభుత్వం మారగానే ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇళ్ల స్థలాలు కేటాయించడంతో నిర్మాణాలు స్వతహా చేసుకుంటున్నారు.

అద్దె ఇంట్లో ఉంటున్నాం



కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసి అద్దె ఇంట్లో ఉంటున్నాం. భూములు కోల్పోయి ప్యాకేజీ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మా కుటుంబంలో నాతో పాటు, 18 ఏళ్లు నిండిన వారికి ఇల్లు, ప్యాకేజీ ఇస్తామని చెప్పారు. నాకు ఇద్దరు అమ్మాయిలు, కుమారుడు ఉన్నారు. నాతో పాటు నాలుగు ప్యాకేజీలు రావాలి. ఇప్పటికీ ఏ ఒక్కటీ దిక్కు లేదు.

- మోత్కూరి రమాదేవి

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టు కోసం భూమి ఇచ్చాం.. కానీ ప్యాకేజీలు రావడం లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం, కలెక్టర్ స్పందించి ప్యాకేజీలు రానివారికి అందించే విధంగా కృషి చేయాలని కోరుతున్నాం.

- సత్యం, మామిడ్యాల


మృతిచెందిన రక్షిత్, గాయపడిన తల్లిదండ్రులు

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారులు మృతి

● తల్లిదండ్రులకు తీవ్రగాయాలు


రక్షిత్ (ఫైల్) ధ్రువరెడ్డి(ఫైల్)

నర్సాపూర్/ బెజ్జంకి మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. మెదక్ జిల్లా నర్సాపూర్, సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో శుక్రవారం ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలప్‌చెడ్ మండలం చండూరు గ్రామానికి చెందిన సంగారెడ్డి రామిరెడ్డి తన భార్య మాధవి, మూడేళ్ల కుమారుడు ధ్రువరెడ్డి(3)తో కలిసి తమ గ్రామం నుండి మల్లంపేటకు స్కూటీపై వెళ్తున్నారు. నర్సాపూర్ సమీపంలోని సబ్‌స్టేషన్ వద్ద స్కూటీ అదుపు తప్పి రేలింగ్‌ను ఢీకొట్టింది. ధ్రువరెడ్డి రేలింగ్‌కు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మాధవికి తీవ్ర గాయాలయ్యాయి. నర్సాపూర్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన గుళ్ల శ్రీకాంత్, కళ్యాణి కుమారుడు రక్షిత్ (7) కలిసి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ద్విచక్ర వాహనంపై ముగ్గురు కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై గుర్తుతెలియని బ్లాక్ కలర్ కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈఘటనలో రక్షిత్ అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని కారు ఢీకొన్న తర్వాత దాదాపు 150 మీటర్ల వరకు రోడ్డుపై ఈడ్చుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్, కల్యాణిని అంబులెన్స్‌లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.


వివరాలు తెలుసుకుంటున్న బీడీఎల్ పోలీస్ అధికారులు

ఫర్నీచర్ గోదాంలో అగ్నిప్రమాదం

పటాన్‌చెరురూరల్, మే 30(ఆంధ్రజ్యోతి) : బీడీఎల్ భానూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పాటి గ్రామంలోని అను ఫర్నీచర్ గోడౌన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బీడీఎల్ పోలీసులు కూడా అక్కడికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఎంత మేరకు నష్టం వాటిల్లిందనేది తెలియాల్సి ఉంది. షార్ట్‌సర్క్యూట్ వల్లే ఈప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

హవేళిఘణపూర్, మే 30(ఆంధ్రజ్యోతి); రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని డైట్, హవేళిఘణపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన జీవో 317, పాతపెన్షన్ విధానం అమలు చేయడం, పీఆర్సీ పెండింగ్‌లో ఉన్న డీఏ, జీపీఎఫ్ నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన విద్య ఉంటుందని తమ పిల్లలను ఈ బడిలోనే చేర్పించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, ఎంఈవో సుదర్శనమూర్తి, తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, స్వరూపారాణి, రామారావు, మాధవరెడ్డి, సిద్దు, బీజేపీ నాయకులు గడ్డం శ్రీనివాస్, సత్యనారాయణ, సంతోష్, కాశీనాథ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న బీజీ-3 భూతం

- నిషేధిత, నకిలీ పత్తి విత్తనాల బెడదతో రైతుల బేజారు
- తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు అంటూ అంటగడుతున్న వ్యాపారులు
- భూసార క్షీణత, కాలుష్య కారక బీజీ-3పై నిషేధం
- అయినా గ్రామీణ మార్కెట్‌లో లభిస్తున్న విత్తనాలు
- కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్


గత ఏడాది పట్టుబడిన అనుమతి లేని బీజీ-3 పత్తి విత్తనాలు

గజ్వేల్, మే 30 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులను కల్తీ భూతం వెంటాడుతోంది. నకిలీ, నాసిరకం విత్తనాల నిరోధానికి ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసినా రైతులకు మాత్రం బీజీ-3తో పాటు నకిలీ విత్తనాలు చేరుతున్నాయి. ఏటా ఈ సంఖ్య కొంత మేర తగ్గుతున్నా పూర్తిస్థాయిలో నివారించడం సాధ్యపడడంలేదు. గ్రామీణ స్థాయిలో అధిక దిగుబడులు, తక్కువ ధర పేరుతో పలువురు వ్యాపారులు నాసిరకం, కల్తీ విత్తనాలను విక్రయించి రైతులను ముంచుతున్నారు. వేసవి ఆరంభం నుంచే గ్రామాల్లో మాటువేసిన ఏజెంట్లు తక్కువ ధరకు, అప్పు కింద ఇస్తామని రైతులను మభ్యపెట్టి కల్తీ విత్తనాలు అంటగడుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉంది. ప్రధానంగా పత్తిని వర్షాధార పంటగా సాగుచేసే రైతులను వీరు లక్ష్యంగా చేస్తున్నారు. ప్రభుత్వం నిషేధించిన బీజీ-3 రకం పత్తి విత్తనాలతో పాటు, లూజ్ విత్తనాలను రైతులకు అంటగడుతూ వ్యాపారులు, ఏజెంట్లు దండుకుంటుండగా, ఆ విత్తనాలు సాగుచేసిన రైతులు మాత్రం ఆశించిన దిగుబడులు రాక నష్టాల పాలవుతున్నారు. అయినప్పటికీ రైతులు మాత్రం ఈ విత్తన సాగుపై నిరాసక్తి ప్రదర్శించడం లేదు.

బీజీ-3తో అనేక నష్టాలు...

బీజీ-3 సాగు వలన భూసారం తీవ్రంగా కోల్పోవడంతో పాటు, వాతావరణ కాలుష్యానికి తీవ్ర కారకంగా ఉంటుందనే శాస్త్రవేత్తల సూచనల మేరకు దేశంలో వీటిని నిషేధించారు. కేవలం బీజీ-1, బీజీ-2 విత్తనాలను మాత్రమే రైతులు సాగుచేయాలి. అయితే బీజీ-2 విత్తనాలను అక్రమంగా ఉత్పత్తి చేస్తున్న కొన్ని సంస్థలు, వాటిని నేరుగా రైతులకు సరఫరా చేస్తున్నాయి. బీజీ-2 సాగుచేస్తే విత్తనం నాటిన 60 రోజుల తర్వాత దోమ పోటు ఉంటుందని, అదే బీజీ-3 సాగుచేస్తే పంట దిగుబడి పూర్తయ్యేంత వరకు దోమపోటుతో పాటు, పురుగుల బెడద, తెగుళ్ల తాకిడి ఉండదనే ప్రచారంతో ఈ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. దిగుబడి సైతం బీజీ-2 కంటే 30 శాతం మేర ఎక్కువగా వస్తుందని చెబుతున్నారు. పెట్టుబడి సైతం తగ్గుతుందని, పురుగుమందులు, దోమమందులు, తెగుళ్ల మందులు వినియోగించే అవసరం ఉండకపోవడంతో పెట్టుబడి సైతం 50 శాతం మేర తగ్గుతుందనే ప్రచారం బలంగా ఉండడంతో రైతులు సైతం బీజీ-3 విత్తనాల సాగుకు మొగ్గు చూపుతున్నారు.

కట్టడి చేస్తేనే..

బీజీ-3, నకిలీ విత్తనాలను మార్కెట్లోకి రాక ముందే తయారీ సందర్భంలోనే కట్టడి చేయడమే వీటి నియంత్రణకు ఏకైక పరిష్కారమనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ప్రధానంగా బీజీ-3 విత్తనాలను తీసుకువస్తున్న ముఠాలను గుర్తించి వారిపై పీడీయాక్ట్ ప్రయోగించాలని డిమాండ్ చేస్తున్నారు. విత్తనాల తయారీ కంపెనీలపై కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని, బీజీ-3, లూజ్ విత్తనాలను బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సూచిస్తున్నారు. జర్మినేషన్ పరీక్షల తర్వాత ఫెయిల్ విత్తనాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారమని రైతుసంఘాల నాయకులు సూచిస్తున్నారు.

గతేడాది సీజన్ అయిపోయాక..

గతేడాది సీజన్ అయిపోయిన అనంతరం రాయపోల్, వర్గల్ మండలాల్లోని పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు బీజీ-3, అనుమతి లేని, నకిలీ విత్తనాలు లభించాయి. అప్పట్లో మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ ద్వారా తనిఖీలు నిర్వహించినప్పటికీ గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారులు రైతులకు బీజీ-3, నకిలీ విత్తనాలను విక్రయించారు. ఉన్నతాధికారులు సమావేశాలు పెట్టి గట్టి నిఘా పెట్టాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో మాత్రం పనితీరు సరిగా లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు, నష్టం తప్పడం లేదు. ముఖ్యంగా వర్గల్, రాయపోల్ మండలంలోని బొర్రగూడెం, మాదారం, ఎల్కల్, బేగంపేట తదితర గ్రామాల్లో బీజీ-3 విత్తనాలు గతంలో చాలా సార్లు పట్టుబడ్డాయి. గతేడాది ములుగు మండలంలోని పలు గ్రామాల్లో గల ఆయా కంపెనీల్లో అనుమతి లేని విత్తనాలు పెద్ద ఎత్తున పట్టుబడ్డాయి.

తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి



రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుంటేనే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు రసీదును తప్పనిసరిగా తీసుకుని దాచిపెట్టుకోవాలి. లూజ్ విత్తనాలు, అనుమతి లేని, నకిలీ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో రైతులు తీసుకోవద్దు. ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి.

-బాబునాయక్, వ్యవసాయ శాఖ ఏడీ

నకిలీ విత్తనాలపై నిఘా



నకిలీ, అనుమతి లేని విత్తనాలపై పటిష్ఠ నిఘాను ఏర్పాటు చేశాం. మండలాల వారీగా మండల టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశాం. క్రమం తప్పకుండా ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. ఎవరైనా నకిలీ, అనుమతి లేని, రసీదు లేని విత్తనాలు విక్రయిస్తే వ్యవసాయాధికారులకు లేదా పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- కె. నర్సింహులు, ఏసీపీ గజ్వేల్

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో
ముగ్గురి మృతి

- ముగ్గురికి గాయాలు


ఘటనా స్థలంలో పడి ఉన్న రంగు రాహుల్

చేర్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటనల కొమురవెల్లి మండలం కిష్టంపేట గ్రామశివారులో శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంగునూరు మండలం పాలమాకుల గ్రామానికి చెందిన రంగు రాహుల్ (25), గడ్డం అజయ్ బైక్‌పై కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో కిష్టంపేట శివారులో అశోక్ లేలాండ్ వాహనాన్ని వారు ఢీ కొనడంతో బైక్‌పై నుంచి కిందపడిపోయారు. రాహుల్ తలకు గాయాలై తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారకస్థితిలోకి చేరుకోగా, అజయ్‌కు గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాహుల్ మృతిచెందాడు. బైక్ నడుపుతున్న రాహుల్ తలకు బలమైన గాయమైన క్రమంలో హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు దక్కేవి. మృతుడి కుటుంబీకులు కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని..


ఘటనా స్థలంలో రక్తపు మడుగులో పడి ఉన్న విష్ణుప్రసాద్

పాపన్నపేట, మే 30(ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలం కేంద్రం పాపన్నపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విష్ణుప్రసాద్(28) ఉపాధి నిమిత్తం పాపన్నపేటలో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి సరుకులు తెచ్చుకోవడానికి బయటికి వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటే క్రమంలో మెదక్ వైపు నుంచి వస్తున్న ఓ కారు మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి అతనిడి ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయలైన విష్ణుప్రసాద్‌ను స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్, డీసీఎం ఢీకొని యువకుడు..

- భార్య, కొడుకుకు తీవ్ర గాయాలు


మృతుడు నరేష్

మర్కుక్, మే 30 (ఆంధ్రజ్యోతి): డీసీఎం, ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడి కుటంబ సభ్యులు, మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొల్గూరు నరేష్(35) తన భార్య కళ్యాణి, కుమారుడు అంశూత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గౌరారం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో డీసీఎం, ద్విచక్రవాహనం రెండు ఢీకొనడంతో నరేష్, అతడి భార్య, కొడుకుకు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌ను రప్పించి ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ నరేష్ మృతిచెందాడు. కళ్యాణి, అంశూత్‌లను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి కొమురయ్య(60) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.


గ్రామపంచాయతీ ఆవరణలో ఆందోళన చేస్తున్న వివిధ పార్టీ నాయకులు

బొంతపల్లికి ఒకటే ఇందిరమ్మ ఇల్లు

- గ్రామస్థుల ఆగ్రహం
- అధికారిక శంకుస్థాపన బహిష్కరణ

గుమ్మడిదల, మే 30 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని బొంతపల్లి వార్డు కార్యాలయం పరిధిలో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ చేయటానికి వచ్చిన అధికారులను గ్రామస్థులు నిలదీశారు. తమ గ్రామానికి ఒకటే ఇల్లును మంజూరు చేస్తారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆందోళన దిగారు. శనివారం గుమ్మడిదల మండలంలో వివిధ గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల చేత అధికారులు శంకుస్థాపన చేయించారు. ఇందులో భాగంగా బొంతపల్లి గ్రామంలో నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని గ్రామస్థులు బహిష్కరించారు. 10 వేల మంది జనాభా, 6వేల ఓట్లు ఉన్న గ్రామానికి కేవలం ఒక ఇల్లు మాత్రమే మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సురభి నాగేందర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీకి ఒకే ఇల్లు ఇవ్వడం బాధాకరమన్నారు. గ్రామంలో అనేక నిరుపేద కుటుంబాలు నివసిస్తున్నపటికీ ఒకరికే ఇల్లు మంజూరు చేయడం తగతదన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు కార్యక్రమాన్ని రద్దు చేసుకుని వెళ్లిపోయారు. ఈ సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరిన్ని ఇళ్ల మంజూరు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, మే 30(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పరిధిలోని నిజాంపేట్ మండలం బాచేపల్లిలోని గిరిజన సంక్షేమ మినీ గురుకుల బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు సమర్పించాలని గురుకులం ప్రిన్సిపాల్ కవిత శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఒకటో తరగతిలో 30 ఖాళీలు, 5వ తరగతిలో 16 ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు పాఠశాలలో జూన్ 6న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 9వ తేదిన పాఠశాలలో ఉదయం 10 గంటలకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక నిర్వహించనున్నట్లు తెలిపారు. సొంత మండలం విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఎంపికైన వారి జాబితా 10వ తేదీన పాఠశాల నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తామన్నారు. ఆధార్, ఫోటో, ధ్రువీకరణ, పత్రాలను పాఠశాలలో అందించాలని సూచించారు.

కార్యదర్శులకు బుజ్జగింపు !

- డీఎస్ఆర్ నుంచి తూకం ఆప్షన్ తొలగింపునకు సుముఖత

దుబ్బాక, మే30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సహాయనిరాకరణతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు దిగొచ్చారు. కార్యదర్శులను బుజ్జగించే చర్యలకు ఉపక్రమించారు. పంచాయతీ కార్యదర్శులతో చర్చలు జరిపి అటెండెన్స్ అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం పంచాయతీరాజ్ కమిషనర్ శ్రీజన జిల్లాలోని డీపీవోలు, డీఎల్‌పీవోలకు సూత్రపాయంగా ఆదేశాలు జారీ చేశారు. డీఎస్ఆర్ యాప్‌లోని తడి,పొడి చెత్తను తూకం వేసే అంశాన్ని తొలగిస్తామని హామీనిచ్చారు. ఈ మేరకు ఎంపీవోలు పంచాయతీ కార్యదర్శులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విధులకు హాజరు కావాలని కోరారు. డీఎస్ఆర్ యథావిధిగా ఉంటుందని, వెంటనే అటెండెన్స్‌ను వేయాల్సిందిగా ఆదేశించారు. కాగా, శుక్రవారం సాయంత్రం వరకు దీనిపై పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. తాము అప్పు చేసి, గ్రామపంచాయతీలకు ఖర్చు చేసిన డబ్బులను ఇవ్వాలని కూడా వారు పెట్టిన డిమాండ్‌లో ప్రధానంగా ఉందని వారు తెలుపగా.. ఆర్థికపరమైన అంశాలు తమచేతులో లేవని అధికారులు తేల్చిచెప్పారు. ఈ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం కార్యదర్శులను సముదాయించేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తున్నారు. శనివారం కార్యదర్శులు ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

పొరపాట్లు పునరావృతం కావొద్దు

- ఇంటర్ బోర్డ్ అబ్జర్వర్ భీమ్‌సింగ్

సిద్దిపేట కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ మూల్యాంకనంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పులు చేస్తే చర్యలు తప్పవని ఇంటర్ బోర్డ్ అబ్జర్వర్ భీమ్‌సింగ్ హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల(కో ఎడ్యుకేషన్)లో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంపు అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మూల్యాంకన కేంద్రం అధికారి రవీందర్‌రెడ్డితో కలిసి అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లను క్యాంపు అధికారుల దృష్టికి తెచ్చామని, అవి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఎగ్జామినర్ మదింపు చేసిన పేపర్‌ను సీఈ లేదా ఎస్ఈ మదింపు చేస్తే ఐదు మార్కులు కంటే ఎక్కువ తేడా వస్తే సంబంధిత ఏఈకి మెమో జారీ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మూల్యాంకన కేంద్రం మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉందని, హైదరాబాద్ ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి ప్రతీ అంశాన్ని గమనిస్తున్నట్లు చెప్పారు. అధ్యాపకులు పొరపాట్లకు తావు లేకుండా విద్యార్థుల జవాబు పత్రాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించి మదింపు చేయాలని సూచించారు. ఈసారి ప్రతీ రెండు బోర్డులకు ఒక సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ ను నియమించామన్నారు. చీఫ్ ఎగ్జామినర్(సీఈ)లు, స్క్రూటినైజర్లు వారి విధులను పక్కాగా చేస్తే పొరపాట్లకు తావుండదని చెప్పారు. క్యాంపు అధికారి, డీఐఈవో రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట మూల్యాంకన కేంద్రానికి మంచి పేరు ఉందని, అధ్యాపకులు నిబద్ధతతో పనిచేసి విద్యార్థులకు నష్టం జరగకుండా మదింపు చేసి మంచి పేరును నిలుపుకోవాలని సూచించారు. జనరల్-1 సత్యనారాయణరెడ్డి, జనరల్-2 మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వార్షికోత్సవం


మాట్లాడుతున్న పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి

నారాయణఖేడ్, మే 30(ఆంధ్రజ్యోతి): జీవితం శాంతియుతంగా ముందుకు సాగాలంటే ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పుడే సాధ్యమని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతిమాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ శివార్లలోని రమాసహిత సత్యనారాయణస్వామి 21వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం భక్తులనుద్దేశించి మాట్లాడారు. అంతకుముందు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు చిన్ని మధుకర్, వేద పండితులు గురుజ్యోషి, బ్రాహ్మణ సంఘం బాధ్యులు రాఘవాచారిజ్యోషి, పద్మనాభచారి, వినోద్‌పంతులు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకారణలో దర్శనమిస్తున్న స్వామివారు

కూలీ డబ్బు ఇవ్వనందుకే
హతమార్చాడు

- 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరేందర్‌గౌడ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

తూప్రాన్, మే 30(ఆంధ్రజ్యోతి): చేసిన పనులకు కూలీ డబ్బులు చెల్లింపు విషయంలో జరిగిన గొడవలో దాడి చేసి హతమర్చాడు ఓ వ్యక్తి. బుధవారం రాత్రి జరిగిన ఈ హత్య కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోని కేషన్ పరిశ్రమలో చోటుచేసుకున్నది. సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ సీఐ రంగ కృష్ణ, మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్‌లతో కలిసి ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామికవాడలోని కేషన్ పరిశ్రమలో లేబర్ కాంట్రాక్టర్ ఏసుదాసన్ వద్ద బుధవారం హైదరాబాద్ బండ్లగూడకు చెందిన వద్దవత్ నరేష్, ఉప్పల్ చిలుకనగర్‌కు చెందిన కే.నలీన్‌కుమార్ (55), అంజద్‌లు కూలీ పనులు చేశారు. పనుల అనంతరం అందరూ పరిశ్రమలోని లేబర్ రూంలో ఉన్నారు. కొంత సమయానికి అంజద్ ఇంటికి వెళ్లిపోగా, నరేష్, నలీన్‌కుమార్ ఇద్దరు రాత్రి 7గంటలకు బయటకు వెళ్లారు. నలీన్‌కుమార్ మద్యం సేవించగా, నరేష్ తాగకుండానే లేబర్ రూంకు వచ్చారు. రాత్రి 11 గంటలకు నలీన్‌కుమార్ మద్యం మత్తులో నరేష్‌తో గొడవ పడి, నరేష్‌ను ఇంటికి వెళ్లిపోవాలంటూ బెదిరించాడు. దాంతో కూలీ డబ్బులు ఇస్తే పోతానంటూ నరేష్ చెప్పగా, రూ. 100 ఇస్తానంటూ నలీన్‌కుమార్ చెప్పాడు. మొత్తం కూలీ డబ్బులు ఇవ్వాలనడంతో గొడవ మొదలైంది. ఈ క్రమంలో నరేష్ నలీన్‌కుమార్‌ను చెంపపై కొట్టి తోసివేయగా అతడి తలకు గాయమైంది. అనంతరం ఛాతిపై దాడి చేయగా నలీన్‌కుమార్ కుప్పకూలి మృతిచెందాడు. దీంతో నరేష్ మొబైల్ ఫోన్ తీసుకొని రూంకు తాళం వేసి కాంపౌండ్‌వాల్ దూకి పారిపోయాడు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద నిందితుడు నరేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 24 గంటల్లో కేసును ఛేధించి నిందితుడిని పట్టుకున్న సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్, సిబ్బందిని అభినందించారు.

బంగారు నగల కోసం మహిళ దారుణ హత్య

- గొంతుకోసి పుస్తెల తాడు, నాను ఎత్తుకెళ్లిన దుండగులు
- సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లిలో ఘటన


బాల్‌లక్ష్మి(ఫైల్)

చిన్నకోడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఆభరణాల కోసం గుర్తు తెలియని దుండగులు ఓ మహిళను గొంతు కోసి హతమార్చిన సంఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం కమ్మర్లపల్లిలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన గాలి బాల్‌లక్ష్మి(55) ఇంటి వద్ద కిరాణం షాపు నిర్వహిస్తుండగా భర్త సుధాకర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు స్వాతి, కుమారుడు వెంకటేష్ ఉన్నారు. ఇద్దరికి వివాహాలు జరిగాయి. శుక్రవారం మధ్యాహ్నం బాల్‌లక్ష్మి షాప్‌లో ఉండగా గుర్తు తెలియని దుండగులు వచ్చి కూల్ డ్రింక్ కొనుగోలు చేశారు. అనంతరం బాల్‌లక్ష్మి టీ పెట్టుకుని తాగేందుకు ఇంట్లోకి వెళ్లగా గమనించిన దుండగులు షాప్ పక్కన ఉన్న గేటు నుంచి ఇంట్లోకి వెళ్లి ఆమెను బంగారు ఆభరణాలు ఇవ్వాలని బెదిరించారు. ఆమె ప్రతిఘటించడంతో బాల్‌లక్ష్మి గొంతు కోసి దారుణంగా హత్య చేసి పుస్తెల తాడు, నాను తీసుకుని పరారయ్యారు. సాయంత్రం ఇంటి తిరిగి వచ్చిన భర్త సుధాకర్ బాల్‌లక్ష్మి రక్తపు మడుగులో పడి మతిచెంది ఉండటాన్ని గమనించి చుట్టుపక్కల వారికి చెప్పాడు. గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించగా సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ బాలకృష్ణ, పోలీసు సిబ్బంది, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆనవాళ్ల ఆధారంగా ఆభరణాల కోసమే బాల్‌లక్ష్మిని గొంతుకోసి చంపినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మృతురాలి భర్త సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తదితరులు

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పరామర్శ

గజ్వేల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు విభూతి బాలమణి కుటుంబాన్ని దుబ్బాక శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్‌ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శించారు. ఆమె మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించిన వారు కుటుంబసభ్యులకు ధైర్య చెప్పారు. వారివెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు మాదాసు శ్రీనివాస్, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, పాల రమేశ్‌గౌడ్ తదితరులున్నారు.

బాలుడి మృతి బాధాకరం

●దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, మే30(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో కనకయ్య కుమారుడు వికాస్ ట్రాక్టర్ రోటోవేటర్ కింద ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన విషయం తెలిసిందే. శుక్రవారం ఈవిషయాన్ని తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి మృతిచెందిన బాలుడు వికాస్ కుటుంబాన్ని పరామర్శించారు. ట్రాక్టర్ కిందపడి బాలుడు చెందడం తనను కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని హామి ఇచ్చారు.

పౌరహక్కుల దినోత్సవం

చేర్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం శబాషీగూడెం గ్రామంలో రెవిన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆర్ఐ అయిలయ్య ఎస్సై రాజు మాట్లాడారు. ఇతరుల హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరచర్యలు తప్పవని సూచించారు. అంటరానితనం, బహిష్కరణకు ఒడిగడితే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

●డీలర్లు తప్పనిసరిగా బిల్‌బుక్‌లు, స్టాక్ రికార్డులను వినియోగించాలి





రాయపోల్‌లోని ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు, డీలర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాబూనాయక్

రాయపోల్/సిద్దిపేటరూరల్/దుబ్బాక/మిరుదొడ్డి, మే30 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లోని ఫర్టిలైజర్ షాపులలో టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా సరే రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలుతప్పవని దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి మండల వ్యవసాధికారులు ప్రవీన్‌కుమార్, సత్యాన్వేష్‌లు హెచ్చరించారు. శుక్రవారం దుబ్బాక, అక్బర్‌పేటలోని ఫర్టిలైజర్ దుకాణాలను దుబ్బాక , అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐలు గంగరాజు, హరీష్‌లతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు ఎరువుల దుకాణాల్లోని విత్తనాలను, పిచికారి మందులను పరిశీలించారు. రైతులు ఎరువుల దుకాణాల్లో ఎవ్వైనా విత్తనాలుకానీ మందులను తీసుకున్న వెంటనే రసీదును తీసుకోవాలని సూచించారు. డీలర్లు తప్పనిసరిగా బిల్ బుక్‌లు, స్టాక్ రికార్డులను వినియోగించాలని తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేని బిజి 3పత్తివిత్తనాలను అమ్మితే పీడీయాక్టు కేసులను నమోదుచేయడంతో పాటు లైసెన్సులను రద్దుచేస్తామని హెచ్చరించారు. రాయపోల్‌లోని పలు విత్తన డీలర్స్ షాపులను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీ చేసింది. నకిలీ విత్తనాలను రైతులకు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారులు బి.పరుశురామ్ రెడ్డి, నరేష్‌లు విత్తన డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం సిద్దిపేట రూరల్ మరియు నారాయణరావుపేట మండలలాల్లోని విత్తనాల డీలర్ల దూకాణాలను రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డితో కలిసి తనిఖి చేశారు. ప్రతి రైతుకు విధిగా బిల్లు ఇవ్వాలని, స్టాక్ వివరాలు, ధరల పట్టికలను షాపు నందు ఏర్పాటు చేయాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు బాబూనాయక్, ఏఎస్సైఐ రాజు హెచ్చరించారు.

బీఆర్ఎస్, బీజేపీ ఒక గూటి పక్షులే

●డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, బీజేపీ ఒక గూటి పక్షులేనని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలనే నీతిని పెద్దలు ఇప్పటికి గుర్తు చేస్తుంటారని, అయితే ఇంట గెలవని కేసీఆర్ గజ్వేల్ ను ఇంకా ఏమి ఉద్దరిస్తారని ఎద్దేవా చేశారు. కమిషన్ల కోసం అభివృద్ధి పేరిట అరచేతిలో వైకుంఠం చూపి ప్రజలను తప్పుదోవ పట్టించగా, అధికారం కోల్పోగానే ఫాంహౌజ్‌కే పరిమితమయ్యారన్నారు. గజ్వేల్ ప్రజలు కేసీఆర్‌ను నమ్మి మూడుసార్లు గెలిపిస్తే ఇక్కడి నేతలు, ప్రజలకు అపాయింట్మెంట్ కరువైందని తెలిపారు. సాహసోపేత పథకాలతో రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న సీఎం రేవంత్ రెడ్డి పేరును నిత్యం జపం చేస్తున్న కేటీఆర్, హరీశ్‌రావులు తమ ఆస్తులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను నమ్మించి గొంతు కోసే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండగా, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు.

అర్హులకు కొమ్మూరి మొండిచేయి

చేర్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : తనను గెలిపిస్తే చేర్యాల రెవిన్యూ డివిజ న్ ఏర్పాటుచేయిస్తా నని ఎన్నికలముందు నమ్మబలికించిన భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈప్రాంత ప్రజల కలల సాకారదిశగా చర్యలు తీసుకోకపోవడం తగదని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలకు ఒకసారైనా రాని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేర్యాల ప్రాంత ప్రజావ్యతిరేకి కొమ్మూరు ప్రతాప్‌రెడ్డితో పర్యటించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. చేర్యాల ప్రాంతంలో 133చెరువులు, కుంటలు ఉండగా, గోదావరి జలాలతో నింపకుండా ప్రేక్షకపాత్ర వహించడం తగదన్నారు. ఈప్రాంత సమస్యల పట్ల చిత్తశుద్ధి కనకబరచకపోవడం సబబుకాదన్నారు. కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లలో అవినీతికి పాల్పడుతూ అర్హులకు అందించకుండా మొండిచేయిచూపుతున్నారని, కమీషన్లు ఇచ్చేవారికి కట్టబెడుతున్నారని, సీసీరోడ్ల నిర్మాణంలో 10శాతం పర్సంటేజీలు తీసుకుని అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చలివేంద్రం ఇలా.. మంచినీరు తాగేదెలా ?



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రం

హుస్నాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల దాహర్తిని తీర్చేందుకు హుస్నాబాద్ పట్టణంలోని పలు చోట్ల మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌చే మంజూరు పత్రాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అక్కడకు వచ్చిన మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మంచినీరు తాగేందుకు రాగా రంజన్లు పగిలిపోయి, నీరు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మొన్నటి వరకు వర్షాలు పడి వాతావరణం చల్లగా ఉండటంతో వీటి అవసరం పడలేదు. కాని శుక్రవారం ఎండకు ప్రజలు ఉక్కపోతకు గురై ఇబ్బందులు పడ్డారు.

అధిక ధరలు వసూలు చేస్తున్నారని ధర్నా



అంగడిలో ధర్నా చేస్తున్న నాయకులు

హుస్నాబాద్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ అంగడిలో నిర్ణయించిన ధరల కంటే రైతులు, చిరు వ్యాపారుల నుంచి కాంట్రాక్టర్ అధికంగా వసూలు చేస్తున్నారని పేర్కొంటూ శుక్రవారం వివిధ పార్టీల నాయకులు ధర్నా నిర్వహించారు. అంగడిని కాంట్రాక్టర్‌పై అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని పలు మార్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అంగడి కాంట్రాక్టర్‌కు కమిషనర్ సహకరించడం వల్లే వారు రైతులను దోపిడికి గురి చేస్తున్నారని తెలిపారు. టెండర్ సమయంలో కాంట్రాక్టర్‌లు సిండికేట్‌గా మారి మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టారని, ఇప్పుడు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించి అంగడి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి, సీపీఎం నియోజకవర్గ నాయకులు గుగులోతు శివరాజ్, నాయకులు ఇంద్రాల సారయ్య, మేకల వికాస్, గోపగాని అరవింద్ తదితరులున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలి

సిద్దిపేట అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టాన్ని రక్షించి పని దినాలు కల్పిస్తూ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్ అన్నారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి కూలీ 600 రూపాయలు పెంచాలని 200 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు పనిచేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఉపాధి కూలీలకు 100 నుండి 150 రూపాయలకు మించి కూలీ పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జాబ్ కార్డులు పనిముట్లను కూడా ఇవ్వాలని అన్నారు.

అంగరంగ వైభవంగా రేణుకాఎల్లమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ

●అమ్మవారిని దర్శించుకున్న వివిధ పార్టీల నాయకులు

కుకునూరుపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల కేంద్రంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ పునః ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గత నాలుగు రోజులుగా శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం ఉదయం మాధవానంద స్వామిచే విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరిగింది. సాయంత్రం అమ్మవారికి బోనాలతో ఉత్సవాలు ముగిసాయి. గౌడ కులస్థులు పెద్ద సంఖ్యలో ఆనందోత్సవాలు మధ్య ఉత్సవాలు జరిపారు. అయోధ్య బాలరాముడి విగ్రహాన్ని చెక్కిన శిల్పి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహాన్ని చెక్కిన శిల్పి అరుణ్ యోగిరాజ్ ఒక్కరే కావడం విశేషం. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం పూర్తి అయిన అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, మాజీ ఎఫ్డీసి చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు, గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు చేయాలి

దౌల్తాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండల కేంద్రంలో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలని శుక్రవారం దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, బీజేపీ నాయకుడు దేవుడి నర్సింహారెడ్డి కలిసి మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు వినతి పత్రం అందిచారు. వెంటనే ఎంపీ రఘునందన్‌రావు స్పందించి ఉమ్మడి మెదక్ జిల్లా పోస్ట్ ఆఫీస్ సూపరిడెంట్‌కు ఫోన్ చేసి సాంక్షన్ చేయాలని కోరగా, త్వరలోనే దౌల్తాబాద్ మండల కేంద్రంలో పోస్ట్ ఆఫీస్ సబ్ బ్రాంచ్ ఏర్పాటుకు కృషి చేస్తానని సూపరిడెంట్ హామీ ఇచ్చారని తెలిపారన్నారు.

షోల్డర్ సర్జరీపై వైద్య విద్యార్థులకు శిక్షణ

ములుగు, మే 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఆర్థోస్కోపి ఫౌండేషన్ మరియు ఆర్విఎం మెడికల్ కాలేజ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో షోల్డర్ కోర్స్ 2025 క్యాడర్ వర్క్ షాప్ ప్రోగ్రాం ఆర్విఎం ఆసుపత్రిలో శుక్రవారం మెడికల్ కాలేజ్, రీసెర్చ్ సెంటర్, ఆస్పత్రి చైర్మన్ యాకయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. 2025 రొటేటర్ కప్ ఇయర్ అనే ప్రత్యేక తీన్ చుట్టూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో దేశీయ అంతర్జాతీయ స్థాయి ఆర్థోపెడిక్ ఫ్రాన్స్ దేశానికి చెందిన నిపుణులు లాంటి సీమస్ డోర్ యాంటీ రియల్ డిసెక్షన్, డాక్టర్స్ జీన్ గ్రిమ్బర్గ్, మసిల్ స్లైడ్, ఆర్థోస్కోపిక్ జిమ్ కానీ, ఆర్థోస్కోపిక్ లాటిస్ డోర్ సీ ట్రాన్స్ఫర్ జీన్‌కానీ, ఆర్ఎస్ఏ విత్ లాటి సిమెంట్ డోర్ సీ ట్రాన్స్ఫర్ జీన్ గ్రీమ్బెర్గ్, దక్షిణ కొరియాకు చెందిన లోయర్ ట్రాపిజియస్ హార్వెస్టింగ్ చాంగ్ హీ బేక్, మసిల్ స్లైడ్ ఓపెన్ పార్ట్ చాంగ్ హి బేక్, హైదరాబాద్ కిమ్స్ సన్ షైన్ చంద్రశేఖర్‌లు పాల్గొని వైద్య విద్యార్థులకు డెడ్‌బాడీ మీద, షోల్డర్ సర్జరీ చేసే విధానం గూర్చి శిక్షణ ఇచ్చారు. ఇందులో బాగంగా త్రీడీ సిమ్యులేటర్ మరియు ఆర్ఎస్ఏ సాబోన్ వర్క్‌షాప్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఆయన వివరించారు.

హిందీ భాషలో నిష్ణాతులను చేయండి

●జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులకు పది రోజులుగా రెండు విడతల్లో ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో శిక్షణా తరగతులు నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి ఈ.శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడుతూ హిందీ భాష లో విద్యార్థులను నిష్ణాతులుగా తయారు చేసి హిందీ భాషాభివృధి కోసం కృషి చేయాలన్నారు . హిందీ ఉపాధ్యాయుల్లో సామర్థ్య నిర్మాణం కోసం కృషి చేసిన డీఆర్‌పీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఐదు రోజులలో ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని హిందీ ఉపాధ్యాయులు అందరూ క్రియాశీలకంగా పాల్గొని పాఠ్య ప్రణాళికలు, పాఠ్య సాధనాలు ప్రదర్శించి, ఉత్సాహంగా కవితలు, కథలు, పాటలు, మొదలగు సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌పీలను ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులను డీఈఓ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా హిందీ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్కీం మార్పుకు పరుగులు

●దరఖాస్తు దారుల అయోమయం



ఎంపీడీవో కార్యాలయంలో స్కీం మార్పుకు పత్రాలను సమర్పిస్తున్న దరఖాస్తుదారులు

మద్దూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత జీవనోపాధి కోసం ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారులు స్కీం మార్పుకు పరుగులు పెడుతున్నారు. మద్దూరు మండలంలో 1194 మంది యువ వికాస పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు మండల అధికారులు చెబుతున్నారు. కాగా మండలానికి ఈ ఏడాదిలో ప్రభుత్వం 270 టార్గెట్ విధించింది. ఇటీవల బ్యాంకర్లతో మండల అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేసి బ్యాంకు పరిధిలో ఏయే గ్రామాలు ఉన్నాయో చర్చించారు. స్కీం ఆదారంగా వచ్చిన దరఖాస్తులను ఆయా బ్యాంకు అధికారులకు చేరవేసినట్లు సమాచారం. అప్పటికే కొన్ని బ్యాంలకు అధికారులు అనర్హులవి రిజెక్ట్ చేసినట్లు సమాచారం. ప్రభుత్వం విధించిన టార్గెట్ ప్రకారంగా రూ.50వేల స్కీంకు 80 మంది టార్గెట్ ఉండగా 15 మంది , రూ.1లక్ష స్కీంకు 68 టార్గెట్ ఉండగా 34 మంది, రూ.2 లక్షల స్కీంకు 57 టార్గెట్ ఉండగా 204 మంది, రూ.4 లక్షల స్కీంకు 65 టార్గెట్ ఉండగా 942 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.50వేల స్కీంలో 65, రూ.1 లక్ష స్కీంలో 34 యూనిట్లు మిగిలి ఉన్నాయి. లక్ష నుంచి పై స్కీంకు వరకు మంత్రిగారి రికమండేషన్ కావాలట వస్తే వచ్చినట్లు లేకుంటే లేదన్నటుగ్గా దరఖాస్తు దారులు చర్చించుకోవడం శోచనీయం.

అవసరం మేరకు రసాయన ఎరువులను వాడాలి

కుకునూరుపల్లి/జగదేవ్‌పూర్/సిద్దిపేట రూరల్, మే30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగిన రైతు ముంగిట్లో కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాగు గురించి అవగాహన కల్పించారు. పంటల సాగులో యూరియా మరియు రసాయన ఎరువుల వాడకం అవసరాన్ని బట్టి వినియోగించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీదేవి రైతులకు సూచించారు. ఖరీఫ్‌లో రైతులు పంటలు సాగు చేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రమేష్ నాయక్, శాస్త్రవేత్త నారం, మట్టి నైపుణ్య శాస్త్రవేత్త డాక్టర్ గిరిజవాణి పేర్కొన్నారు.

రసాయన ఎరువులతో జీవ వైవిధ్యానికి ముప్పు

●పీస్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ

జగదేవ్‌పూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): రసాయనిక ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం వల్ల జీవవైవిద్యానికి ముప్పు వాటిల్లుతుందని పీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, పీస్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ అన్నారు. శుక్రవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని పీస్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో జీవ వైవిధ్యం, పాత పంటల పండుగ నిర్వహించి జీవవైవిధ్య విశిష్టత గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చెట్లను నాటాలని సూచించారు. జీవ వైవిధ్యం అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం సందర్భంగా మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు

సిద్దిపేట కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి);పునర్వసు పురస్కరించుకుని శ్రీ రామరాజు రావి చెట్టు హనుమాన్ దేవాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం అర్చన అలంకరణ అనంతరం 11 గంటలకు విష్వక్సేన ఆరాధన వాసుదేవ పుణ్యావచనం.. మాంగల్యసూత్రాదారణ, అక్షతారోపనం కళ్యాణోత్సవం అశేష భక్త జనుల మధ్య వైభవంగా జరిగింది. ఈ కల్యాణోత్సవంలో దుందిగల్ల శ్రీనివాస్-స్మిత వర్షిణి దంపతులు పాల్గొన్నారని ఆలయ అర్చకులు వైద్య కృష్ణమాచార్యులు తెలిపారు. అనంతరం శ్రీ రామరాజు రావిచెట్టు హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. శ్రీ రామరాజు రావిచెట్టు హనుమాన్ మహిళ గోష్ఠి ఆధ్వర్యంలో సంక్షేప రామాయణ పారాయణం జరిగింది.

కొండపాకలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

కొండపాక, మే 30 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం విశ్వనాథ్‌పల్లి, రవీంద్ర నగర్ గ్రామపంచాయతీ పరిధిలోగల ప్రజా సంఘాల ఆఫీసు వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రోజున జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ 1970లో ఏర్పడినటువంటి సిఐటియు అంచలంచెలుగా ఎదుగుతూ దేశవ్యాప్తంగా అతిపెద్ద సంఘంగా ముందుకు సాగుతుందన్నారు. కార్మికుల ఐక్యత కోరి కార్మికుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు చర్చిస్తూ పోరాటాలను ముందుకు తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అవతరణ దినోత్సవానికి..

మిరుదొడ్డి, మే30 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లోని అబుదాబిలో జరిగే తెలంగాణ రాష్ట్ర 11వ అవతరణ దినోత్సవ వేడుకలకు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత, అంతర్జాతీయ డప్పువాయిద్యకారుడు మిరుదొడ్డి మండలం అందె భాస్కర్‌కు శుక్రవారం ఆహ్వానాన్ని పంపించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఇండియా నెంబర్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈకార్యక్రమానికి వచ్చేనెల 1న డప్పుతో కళాప్రదర్శన చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రాంతం నుండి పేరని నృత్యం గోండు గుస్సాడీ ఒగ్గుడోలు పోతురాజు ఆహ్వానాన్ని అందించినట్టు తెలిపారు.

'సుడా'.. పేరుకే బడా

(3వ పేజీ తరువాయి..)

పరిమితమైంది. జిల్లాలో పెట్రోల్ బంకులు, పెద్దపెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్లు, ఫంక్షన్‌హాళ్లు, లేఅవుట్లు, పౌల్ట్రీఫామ్‌లు ఇలా ఏది కావాలన్నా సుడా అనుమతి తప్పనిసరి. కానీ పాత సుడా పరిధి మినహా కొత్తగా చేర్చిన ఏ ప్రాంతం నుంచి దమ్మిడి ఆదాయం రావడం లేదు. అనుమతుల కోసం బిల్డర్లు, కాంట్రాక్టర్లు సుడా కార్యాలయం గడపతొక్కడం లేదు. ఇంకా ఎక్కడికక్కడే అనుమతులు పొందుతున్నారు. సుడా అనుమతులను తప్పనిసరి చేయడంలో అధికారులు కొన్నినెలలుగా వివిధ కారణాల పేరిట కాలయాపన చేస్తుండడంతోనే ఈ పరిస్థితి వచ్చింది. సిద్దిపేటలా తమ ప్రాంతంలోని కూడలీలు, పార్కులు అభివృద్ధి చెందుతాయని ఆశించిన ఇతర మున్సిపాలిటీలకు ప్రయోజనమేమీ లేకపోవడంతో దేని కోసం సుడా విస్తరణ చేపట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మూడు నెలల సన్నబియ్యం.. ఒకేసారి

(3వ పేజీ తరువాయి..)


రేషన్‌కార్డులను మంజూరు చేశారు. వీరు ప్రజాపాలనలో, మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేసి 10,621 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసి, 33,329 సభ్యులను చేర్చారు. పాత రేషన్‌కార్డులలో మార్పులు చేర్పులు చేసి మరో 60,470 సభ్యులను చేర్చారు. మొత్తం 93,799 మంది సభ్యులను నూతనంగా రేషన్‌కార్డులోకి చేర్చారు. అందరికీ ఈ నెలలోనే సన్న బియ్యాన్ని అందించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో ఇప్పుడు 2,98,985 రేషన్‌కార్డులలో 9,58,598 సభ్యులు ఉన్నారు. ఇటీవల జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తనూజ, డీఎం ప్రవీణ్ కుమార్ కలిసి కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమీక్షించారు. మూడు నెలలకు సంబంధించిన రేషన్‌బియ్యాన్ని లబ్ధిదారులకు జూన్ 1 నుంచి అందించాలని ఆదేశించారు.

నూతనంగా రేషన్ దారులకు సైతం సన్న బియ్యమే

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఒకేసారి జూన్‌లోనే పంపిణీకి ఏర్పాట్లన్నీ పూర్తి చేశాం. లబ్ధిదారులు జూన్ 1 నుంచి 30 వరకు రేషన్ షాపులకు వెళ్లి మూడు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని వేలి ముద్ర వేసి తీసుకోవాలి. నూతన రేషన్‌కార్డుదారులు సైతం మూడు నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఒకేసారి తీసుకోవచ్చు.

- తనూజ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

కాంగ్రెస్ కార్యకర్తల కోసమే రాజీవ్ యువ వికాసం



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ వికాసం కింద తెలంగాణ రాష్ట్ర ప్రజల సొమ్ము రూ.6వేల కోట్ల రూపాయలను అప్పనంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అప్పగించేందుకు ప్రయత్నిస్తుందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాస్ పథకం కింద కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు రూ.6వేల కోట్ల రూపాయలను పంచి పెట్టడం చాలా దారుణమని మండిపడ్డారు. అసలైన అర్హులను పక్కకు పెట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఈ పథకం నిధులను అందించే కుట్రను తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రం దివాలా అంచులో ఉందని, అప్పులు పుట్టడం లేదని స్వయంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూనే... కోట్లాది రూపాయలను కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజీవ్ యువ వికాసం కింద అప్లికేషన్ పెట్టుకున్న ప్రతి ఒక్కరికి లోన్లు మంజూరు చేయాలని, కులమత బేధాలు లేకుండా పార్టీలకు అతీతంగా ఇవ్వాలని వంటేరు వంటేరు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు.

ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణను అందించాలి

ములుగు, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటలపై రైతులకు శాస్త్రవేత్తల ద్వారా శిక్షణను అందించాలని ఆర్టికల్చర్ కమిషనర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం ఆర్టికల్చర్ యూనివర్సిటీలో ఉపకులపతి రాజారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం యూనివర్సిటీకి సంబంధించిన సదరన్, నార్తన్, సెంట్రల్ తెలంగాణ యొక్క జోనల్ హెడ్స్ గత సంవత్సరం నుంచి జరిగిన పరిశోధనలు వాటి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న షేక్ యాస్మిన్ భాష ఐఏఎస్ ఆర్టికల్చర్ కమిషనర్ మాట్లాడుతూ ఉద్యాన పంటల విస్తీర్ణం 12.96 లక్షలు మాత్రమే ఉందని గత పది సంవత్సరాల నుంచి పంటల విస్తీర్ణం క్రమంగా తగ్గుతుందన్నారు. ఎంఐడీహెచ్ ద్వారా 145 కోట్లు హార్టికల్చర్ డెవలప్మెంట్ కి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు.

సర్కారు బడిని బలోపేతం చేద్దాం

తొగుట/గజ్వేల్, మే 30 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడిని బలోపేతం చేద్దామని శాసనమండలి సభ్యులు డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పిలుపునిచ్చారు. యూటీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచార జాతా 3వరోజు గజ్వేల్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఒక ఉపాధ్యాయ సంఘంగా టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ ప్రయోజనాలు మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకోవడం కోసం ఒక ప్రచార యాత్రను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు ..

చేర్యాల, మే 30 (ఆంధ్రజ్యోతి) : కులమతాల పండుగలు, సంప్రదాయాలను గౌరవిస్తూ సోదర భావంతో మెదలాలని, ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. బక్రీద్ పండగ నేపథ్యంలో చేర్యాల పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం ముస్లిం, బీజేపీ, బీజేవైఎం, హిందూవాహిని సభ్యులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు అందజేత

మర్కుక్/రాయపోల్, మే 30 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే పాఠశాలలు పునఃప్రారంభం కానున్నందున పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. శుక్రవారం రాయపోల్ ఎంఈఓ సత్యనారాయణరెడ్డి మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థికి పాఠశాల ఓపెనింగ్ రోజున పుస్తకాలు అందజేయాలని సూచించారు. మండల వనరుల కేంద్రం మర్కుక్ నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలలకు అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలు మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాధికారి వెంకటరాములు చేతుల మీదుగా అందజేశారు.